


## పెరుగుతున్న సైబర్ మోసాలు

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103

సంపుటి - 3 సంచిక -92 బుధవారం 9 సెప్టెంబర్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -6 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Districts




# మీ తల్లిని కాదు.. నా తల్లిని అన్నారు

- ఆవేశం మీకు కాదు.. నాకుండాలి హరీశ్‌రావుపై స్పీకర్ ఆగ్రహం
- మహిళా ఎమ్మెల్యేలపై దాడికి సమాధానం ?చెప్పాలన్న బీఆర్ఎస్
- ఘటనపై పూర్తి నివేదిక కోరామన్న శ్రీధర్ బాబు
- నివేదిక వచ్చిన తర్వాత చర్యలుంటాయన్న స్పీకర్
- స్పీకర్ పై వ్యాఖ్యలకు సమాధానం చెప్పాలన్న కాంగ్రెస్
- స్పీకర్ అంటే తమకు చాలా గౌరవం ఉందన్న హరీశ్ రావు
- తాతా మధు స్పీకర్‌ను ఉద్దేశించి అలా మాట్లాడలేదు
- స్పీకర్ అలా భావిస్తే విచారం వ్యక్తం చేస్తున్నామన్న హరీశ
- పోలీసులపై కేటీఆర్ దాడి చేశారన్న మంత్రి సీతక్క
- ఈ వివాదాలను ఇంతటితో ఆపాలన్న ఏలేటి

# దద్దరిల్లిన కేసీఆర్ ఎర్రవల్లి ఫాంహౌస్

## కేసీఆర్ హత్యకు కుట్రలు : కేటీఆర్

ఎర్రవెల్లి టూ బోయిన్‌పల్లివరకు రాజకీయ కాక

కేసీఆర్ ఫామ్‌హౌస్‌ను ముట్టడించిన కాంగ్రెస్ నేతలు

అడ్డుకున్న పోలీసులు.. వ్యవసాయ క్షేత్రం చుట్టూ పహారా

కేసీఆర్‌కు రక్షణగా కదిలిన బీఆర్ఎస్ శ్రేణులు

రెండు పార్టీల పరస్పర నిరసనలతో ఉద్రిక్తత

బీఆర్ఎస్ ముఖ్యనేతలను అరెస్టు చేసిన పోలీసులు

పోలీసుల అదుపులో కేటీఆర్, హరీశ్‌రావు,తదితరులు.

. సాయంత్రానికి విడుదల

పాలక, ప్రతిపక్షాలకు వేర్వేరు నిబంధనలా?: హరీశ్‌రావు



**హైదరాబాద్‌సెప్టెంబర్ 8(జర్నలిస్ట్ వార్త):**అసెంబ్లీ సమావేశాల ప్రారంభం నేపథ్యంలో సోమవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బ్లాక్ టీషర్ట్స్‌తో మొదలెట్టిన నిరసన.. అటు ఇటు తిరిగి చివరకు మంగళ వారం కేసీఆర్ ఫామ్‌హోస్‌ను కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు ముట్టడించే వరకు వెళ్లింది. ఇరుపార్టీల కార్యకర్తల ఆందోళనలతో ఎర్రవెల్లి రణక్షేత్రంగా మారింది. దళితుడైన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో మర్కుక్ మండలం ఎర్రవెల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రాన్ని ముట్టడించారు. కేసీఆర్ తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో ఎర్రవెల్లికి తరలివచ్చారు. మర్కుక్ మండలం వరదరాజ్‌పూర్ గ్రామం వైపు నుంచి గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు పెద్దఎత్తున ఫామ్‌హౌస్ వైపు కదిలారు. పార్టీ జెండాలు పట్టుకుని, డప్పుల మోతల మధ్య కార్యకర్తలు నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. 'కేసీఆర్ డౌన్ డౌన్' అంటూ ఎర్రవల్లి పరిసరాలు రాజకీయ నినాదాలతో మార్మోగాయి. కాగా వరదరాజపూర్ చౌరస్తాలో కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులు పోటాపోటీగా రేవంత్‌రెడ్డి, కేసీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేయడంతో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది.**భారీగా పోలీసుల మోహరింపు** కాంగ్రెస్ కార్యకర్తలు ఫామ్‌హౌస్ వైపు వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు భారీగా మోహరించారు. ఫామ్‌హౌస్ పరిసర ప్రాంతాల్లో ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటు చేసి కాంగ్రెస్ శ్రేణులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. నిరసనకారులు ముందుకు వెళ్లకుండా పోలీసులు పలు ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించారు. **గజ్వేల్‌లో సైతం ఉద్రిక్తత** కాంగ్రెస్ పార్టీ దళిత నాయకులు, పార్టీ శ్రేణులు గజ్వేల్ నుంచి డప్పులతో ఫామ్ హౌస్ వైపు పెద్దఎత్తున బయల్దేరారు. దాంతో పోలీసులు వారిని ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. అలాగే కేసీఆర్‌కు మిగతాది 2లో...

## తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు..



**హైదరాబాద్‌సెప్టెంబర్ 8(జర్నలిస్ట్ వార్త):**తెలుగు రాష్ట్రా ల్లో మంగళవారం తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. తెలంగాణలో అనేక జిల్లాల్లో ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్, ఉత్తర జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో మెరుపులు, బలమైన గాలులతో కూడిన వర్షాలు, ఉత్తర కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. మత్స్య కారులు తీరప్రాంతంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.


# బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్-2026

- పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి కోమటిరెడ్డి




# ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌లకు సస్పెన్షన్

● సెషన్ మొత్తానికి సస్పెన్షన్ వేటు ● ఇద్దరు ఎమ్మెల్సీలపై చర్యలకు తీర్మానం




# స్పీకర్‌ను పరామర్శించిన సిఎం రేవంత్..




## శాఖలను సమూలంగా మార్చాలని అధిష్ఠానానికి చెప్పా...

- నాకు మంత్రి పదవి ఇవ్వడం అధిష్ఠానం నిర్ణయం
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడి




## తెలంగాణలో 17 మంది డిఎస్‌పిల బదిలీ



# మీ తల్లిని కాదు.. నా తల్లిని అన్నారు

**హైదరాబాద్, సెప్టెంబర్ 8(జర్నలిస్ట్ వార్త):**రాష్ట్ర అసెంబ్లీ ప్రాంగణంలో సోమవారం ఉదయం జరిగిన ఘటనలపై మంగళవారం కూడా సభలో వాగ్యుద్ధం జరిగింది. ఆవేశం మీకు కాదు.. నాకు ఉండాలి అంటూ..ఒక దశలో స్పీకర్ ప్రసాద్‌కుమార్.. హరీశ్‌రావుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండో రోజు సభ ప్రారంభమైన వెంటనే నల్లబ్యాడ్జీలతో బీఆర్ఎస్ సభ్యులు హాజరయ్యారు. సీనియర్ మహిళా సభ్యులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిని అవమానించిన పోలీసులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా సభ్యులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే.. తిరిగి వారిపైనే అక్రమ కేసులు పెట్టారని ఆవేశంగా మాట్లాడారు. రాష్ట్రంలోని యావత్ మహిళలపై జరిగిన దాడిగా దీన్ని పరిగణిస్తున్నామన్నారు. " కలియుగ దుశ్శాసనుడిలా రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు. గౌరవ సభ.. కౌరవ సభగా మారింది. ఆనాడు కౌరవులకు పట్టిన గతే రేపు.. కాంగ్రెస్ పార్టీకి పడుతుంది" అని తీవ్రంగా విమర్శించారు.స్పీకర్ ప్రసాద్ కుమార్ జోక్యం చేసుకుని.. హరీశ్‌రావు వ్యాఖ్యలపై అభ్యంతరం తెలిపారు. "మహిళా సభ్యులంటే సభతో పాటు నాకు కూడా గౌరవం ఉంది. మీరు చెబితే నేను వినట్లేదా.. ఎందుకంత ఆవేశం. మీకు కాదు ఆవేశం.. నాకు ఉండాలి. నీ తల్లిని అనలేదు.. నా తల్లిని అన్నారు" అని భావోద్వేగానికి గురయ్యారు. సబితా ఇంద్రారెడ్డి, సునీత, కోవా లక్ష్మి పట్ల తనకు కూడా గౌరవం ఉందన్నారు. నాకున్న ఎనిమిది మంది అక్కా చెల్లెళ్లతో పాటు వారు కూడా తన సోదరీమణులేనని పేర్కొన్నారు. మహిళా సభ్యులపై దురుసు ప్రవర్తనకు సంబంధించి నివేదిక రాగానే చర్యలు తీసుకుంటామని స్పీకర్ స్పష్టంచేశారు.శాసనసభ వ్యవహారాల మంత్రి డి.శ్రీధర్ బాబు మాట్లాడుతూ... మహిళా సభ్యులపై జరిగిన ఘటనపై రిపోర్ట్ ఇవ్వాలని స్పీకర్ పోలీసులను ఆదేశించారని వివరించారు. మహిళల పట్ల గౌరవం మాకూ ఉందన్నారు. తప్పు జరిగితే కచ్చితంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. స్పీకర్ పైన అనుచిత వ్యాఖ్యలు చేస్తే బీఆర్ఎస్ సభ్యులు ఎందుకు ఖండించలేదని నిలదీశారు. స్పీకర్‌ను బెదిరించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. సభను ఎలా నడపాలనే అంశంపై బెదిరింపు ధోరణిలో మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్ ఇలా చేయొద్దు.. అలా చేయొద్దు అని చెప్పడానికి వాళ్లెవరు..?అని ప్రశ్నించారు. అనుకుంటే.. భావిస్తే ఏంటి.. వీడియోల్లో స్పష్టంగా కనిపిస్తోంది కదా?అని హరీశ్‌రావును ఉద్దేశించి ప్రశ్నించారు... మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడిపై నివేదిక ఇవ్వాలని స్పీకర్ ఆదేశించారు.. స్పీకర్‌పై జరిగినదాన్ని పక్కనపెట్టాలని చెప్పటంతోనే ఆ ఘటనను వీరు ఎంత లైట్‌గా తీసుకుంటున్నారో అర్థమవుతుందని చెప్పారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళా పోలీసుల ముందు బట్టలు విప్పాల్సిన అవసరమేంటని బీఆర్ఎస్ సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్ ను దూషించిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సోమవారం అసెంబ్లీ గేట్ దగ్గర మహిళా ఎమ్మెల్యేలను ముందు పెట్టింది ఎవరూ.. మహిళా పోలీసుల ముందు బట్టలు విప్పింది ఎవరని ప్రశ్నించారు. స్పీకర్‌ను ఆయన తల్లిని దూషించి ఇప్పుడు లేదని దబాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.పోలీసులపై దాడులు చేయడం సబబేనా అనినిలదీశారు. అసెంబ్లీలో రూల్ తెచ్చిందే మీరు.. మీరే పాటించరా అని విమర్శించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు లకారం భాషతో సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఇక, తమ చీర లాగారు.. కొట్టారని బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు చెబుతున్నారు.. నిజంగా మహిళా సభ్యులపై దాడి జరిగితే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల అనుచితంగా ప్రవర్తించిన పోలీసులపై కూడా కేసులు పెడతామని చెప్పారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ స్పీకర్‌ను అవమానిస్తే సహించబోమన్నారు. ముందు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఆ వ్యాఖ్యలపట్ల వారికి కనీస పశ్చాత్తాపమే లేదన్నారు. స్పీకర్ పదవిని అవమానించడం అంటే రాజ్యాంగ వ్యవస్థనే అవమానించడమన్నారు. మహిళా ప్రజాప్రతినిధులు మాకు కూడా సోదరీమణులే.. వారిపై దాడిని ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించమని చెప్పారు. ఒకవైపు మహిళలపై జరిగిన ఘటనపై విచారణ కోరుతూ.. మరోవైపు స్పీకర్‌పై వ్యాఖ్యలను సమర్థించడం ఏ న్యాయం?అని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో అణగారిన వర్గాల ప్రజలు కూడా ప్రాణత్యాగాలు చేశారని గుర్తు చేశారు. దళిత వర్గానికి చెందిన వ్యక్తి స్పీకర్ స్థానంలో ఉండడాన్ని బీఆర్ఎస్ జీర్ణించుకోలేక పోతోందా?అని ప్రశ్నించారు. చట్టసభల గౌరవాన్ని కాపాడాల్సిన ప్రజాప్రతినిధులే ఇలా వ్యవహరించడం బాధాకరమన్నారు. దళిత సంఘాలు, ప్రజాసంఘాలు స్పీకర్‌పై వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తు న్నాయని గుర్తు చేశారు. ఇదే అంశంపై ప్రభుత్వ విప్ రామచంద్ర నాయక్, ఎమ్మెల్యే అనురిద్‌రెడ్డి మాట్లాడారు.బీజేపీ సభ్యులు 22ఏపై చర్చించాలని పట్టుబట్టారు. ప్రజా సమస్యలు చర్చకు రావాలని డిమాండ్ చేశారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ పోడియం ముందు బైటాయించారు. మంత్రి జోక్యం చేసుకుని ఆ అంశంపై ప్రత్యేక చర్చ ఉందని చెప్పారు. వారు, వీరు కలిసి లోపాయికారి ఒప్పందంతో స్పీకర్‌పై జరిగిన దాడిని పక్కదారి పట్టిస్తున్నారనిబీజేపీసభ్యులును ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

# ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌లకు సస్పెన్షన్

**హైదరాబాద్‌సెప్టెంబర్ 8(జర్నలిస్ట్ వార్త):**తెలంగాణ రాజకీయాల్లో అసెంబ్లీ ఆవరణలో చోటు చేసుకున్న వివాదం మరో కీలక మలుపు తిరిగింది. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిపై శాసనమండలి సస్పెన్షన్ వేటు వేసింది. ప్రస్తుత వర్షాకాల సమావేశాలు ముగిసే వరకు ఇద్దరినీ మండలి నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. ఇద్దరు ఎమ్మెల్సీలను సస్పెండ్ చేయాలని మంత్రి శ్రీధర్‌బాబు శాసనమండలిలో తీర్మానం ప్రవేశపెట్టారు. ఆ తర్వాత శాసనమండలి ఛైర్మన్ మూజువాణి పద్ధతిలో ఓటింగ్ నిర్వహించారు. తీర్మానానికి ఆమోదం లభించిన తర్వాత తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిని ప్రస్తుత సెషన్ మొత్తానికి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత మండలి సమావేశాన్ని వాయిదా వేశారు. స్పీకర్‌పై ఎమ్మెల్సీలు చేసిన వ్యాఖ్యల వ్యవహారాన్ని శాసనసభ కూడా తీవ్రంగా పరిగణించింది. తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ తీర్మానం చేసింది. తెలంగాణ వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఈ తీర్మానాన్ని శాసనసభలో ప్రవేశపెట్టారు. స్పీకర్ పదవికి గౌరవం తగ్గించేలా వ్యాఖ్యలు చేయడాన్ని శాసనసభ ఖండించింది. సభా మర్యాదలకు విరుద్ధంగా వ్యవహరించడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. మహిళల ఎదుట అనుచితంగా ప్రవర్తించారనే ఆరోపణలను కూడా సభ ఖండించింది.

బీఆర్ఎస్ సభ్యుల ప్రవర్తనకు ఆ పార్టీ అధినేత కేసీఆర్ బాధ్యత వహించాలని, స్పీకర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని తీర్మానంలో పేర్కొన్నారు. అసెంబ్లీ ఆమోదించిన తీర్మానాన్ని శాసనమండలి ఛైర్మన్‌కు పంపించారు. దీనిపై మండలిలో మంత్రి శ్రీధర్‌బాబు మరో తీర్మానం ప్రవేశపెట్టగా.. మూజువాణి ఓటింగ్ అనంతరం ఇద్దరు ఎమ్మెల్సీలపై సస్పెన్షన్ నిర్ణయం వెలువడింది. అసెంబ్లీ ఆవరణలో జరిగిన ఘటనకు సంబంధించి తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మంగళవారం ఉదయం వారిని అదుపులోకి తీసుకుని విచారించిన తర్వాత కోర్టులో హాజరుపరిచారు. అయితే నాంపల్లి కోర్టు పోలీసుల రిమాండ్ అభ్యర్థనను తిరస్కరించింది. వ్యక్తిగత పూచీకత్తుతో విడుదల చేయాలని ఆదేశిస్తూ.. ఒక్కొక్కరు రూ.10 వేల పూచీకత్తుతో పాటు రెండు ష్యూరిటీలు సమర్పించాలని సూచించింది. కోర్టు ఆదేశాల మేరకు ష్యూరిటీలు సమర్పించిన తర్వాత ఇద్దరు ఎమ్మెల్సీలు విడుదలయ్యారు.

కోర్టు నుంచి విడుదలైన తర్వాత ఇద్దరు ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలు శాసనమండలికి హాజరయ్యారు. వారు సభలోకి రావడంపై అధికారపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తాతా మధు, నవీన్ రెడ్డిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. ఈ పరిణామాల మధ్యే సస్పెన్షన్ తీర్మానం మండలి ముందుకు వచ్చింది. తమ పార్టీ ఎమ్మెల్సీలపై సస్పెన్షన్ వేటు వేయడాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకించింది. తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలను నిబంధనలకు విరుద్ధంగా సస్పెండ్ చేశారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు మండలి ఆవరణలో ఆందోళన చేపట్టారు. సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ బైఠాయించారు. ప్రభుత్వం తమ పార్టీ నేతలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు.

# దద్దరిల్లిన కేసీఆర్ ఎర్రవల్లి ఫాంహౌస్

(మొదటి పేజీ తరువాయి)

గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులను సైతం పోలీసులు అడ్డుకున్నారు. దీంతో గజ్వేల్, ప్రజ్ఞాపూర్, శ్రీగిరిపల్లి, గణేష్‌పల్లి, అల్లిరాజ్ పేట్, సింగరాయపల్లి చౌరస్తా, గౌరారం, పాములపర్తిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు నిరసనకు దిగారు. దీంతో పోలీసులు ఇరు పార్టీల శ్రేణులను చెదరగొట్టారు. **కేటీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్యేల అడ్డగింత** ఎర్రవెల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మంగళవారం అసెంబ్లీ నుంచి ఎర్రవెల్లికి బయల్దేరడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసేందుకు వెళ్తున్న వారిని హకీంపేట, బొల్లారం వద్ద పోలీసులు అరెస్టు చేశారు. కేటీఆర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, పద్మారావుగౌడ్, కాలేరు వెంకటేశ్, గూడెం మహిపాల్‌రెడ్డి తదితరులను బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, మాణిక్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి తదితరులను జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టు విషయం తెలియడంతో బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పోలీసు స్టేషన్లకు తరలివచ్చారు.హకీంపేట వద్ద బీఆర్ఎస్ నేతలు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి పర్యవేక్షణలో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. మాజీ ముఖ్యమంత్రి నివాసం వద్ద భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా అరెస్టు చేసినట్టు పోలీసు అధికారులు తెలిపారు.

**ఇచ్చిన హామీలపై సమాధానం చెప్పాలి : కేటీఆర్** ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నిస్తే ప్రభుత్వం సమాధానం చెప్పకుండా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై దాడులు, అరెస్టులకు పాల్పడుతోందని కేటీఆర్ ఆరోపించారు. బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో కేటీఆర్ మాట్లాడుతూ.. అసెంబ్లీ వద్ద ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించిన తీరును ఖండించారు. నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు, మహిళలకు రూ.2,500, ఆడపిల్లలకు స్కూటీలు వంటి హామీలు ఏమయ్యాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారని అన్నారు. హామీల అమలుపై అసెంబ్లీలో ప్రశ్నించాలని కేసీఆర్ తమకు సూచించారని తెలిపారు. సోమవారం అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకున్నారని, మంగళవారం కేసీఆర్‌ను కలిసేందుకు ఎర్రవెల్లి వెళ్తుంటే అడ్డుకున్నారని విమర్శించారు. రానున్న రోజుల్లో ప్రజలే ప్రభుత్వానికి తగిన సమాధానం చెబుతారన్నారు.

**పాలక పక్షానికి.. ప్రతిపక్షానికి వేర్వేరు నిబంధనలా? : హరీశ్‌రావు** పాలక పక్షానికి, ప్రతిపక్షానికి వేర్వేరు నిబంధనలు ఉన్నాయా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ నాయకులను ఎర్రవెల్లి వెళ్లకుండా అడ్డుకుంటూ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను మాత్రం అనుమతిస్తున్నారని ఆరోపించారు. తమ పార్టీ అధినేత కేసీఆర్‌ను కలిసే హక్కు తమకు ఉందని, ఎర్రవెల్లి వెళ్లకుండా ఎందుకు అడ్డుకుంటున్నారో పోలీసులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నేతల అరెస్టులతో ఆయా పోలీస్‌స్టేషన్ల వద్ద పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరి నాయకులను వెంటనే విడుదల చేయాలని నినాదాలు చేశారు.

## స్పీకర్‌ను పరామర్శించిన సిఎం రేవంత్..

**హైదరాబాద్ సెప్టెంబర్ 8(జర్నలిస్ట్ వార్త):**అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఆయన ఛాంబర్‌లో మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు కలిసి పరామర్శించారు. సోమవారం అసెంబ్లీ ఎదుట జరిగిన పరిణామాల నేపథ్యంలో స్పీకర్‌ను సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కలు కలిశారు. బిఆర్ఎస్ ఎమ్మెల్సీలు స్పీకర్‌ను వ్యక్తిగతంగా దూషించటంతో స్పీకర్ గడ్డం ప్రసాద్ సోమవారం కంట తడి పెట్టుకున్న దృశ్యాలు చూసి ముఖ్యమంత్రి ఆవేదన చెందారు. మంగళవారం అసెంబ్లీకి రాగానే స్పీకర్ ఛాంబర్‌కు వెళ్లిన సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టిలు స్పీకర్‌ను పరామర్శించి, ఓదార్చారు. సోమవారం జరిగిన సంఘటనలపై వారిద్దరూ విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అండగా ఉంటుందని, బాధ్యులపై తప్పకుండా తగిన చర్యలు తీసుకుంటుందని స్పీకర్‌కు వారు హామినిచ్చారు.

## శాఖలను సమూలంగా మార్చాలని అధిష్ఠానానికి చెప్పా...

**హైదరాబాద్ సెప్టెంబర్ 8(జర్నలిస్ట్ వార్త):**తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో కేబినెట్ విస్తరణ, మంత్రుల శాఖల మార్పుపై ఊహాగానాలు షికారు చేస్తున్న వేళ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. గాంధీ భవన్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం కేబినెట్‌లో ఉన్న మంత్రుల శాఖలన్నింటినీ సమూలంగా పునర్వ్యవస్థీకరించి, కొత్త శాఖలను కేటాయించాలని తాను కాంగ్రెస్ హైకమాండ్‌కు స్పష్టమైన సూచన చేసినట్లు వెల్లడించారు. పీసీసీ అధ్యక్షుడిగా తన పరిధి మేరకు పార్టీ ప్రయోజనాల కోసం ఈ సలహా ఇచ్చానని... దానిపై తుది నిర్ణయం తీసుకోవడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అధిష్ఠానం చేతిలోనే ఉందన్నారు. ఇక తనను మంత్రివర్గంలోకి తీసుకునే అంశంపై స్పందిస్తూ... ఆ విషయాలన్నీ అధిష్ఠానం నిర్ణయానికే వదిలేశానని తెలిపారు. ప్రస్తుతం పార్టీని బలోపేతం చేసే బాధ్యత కలిగిన పీసీసీ అధ్యక్షుడిగా నిరంతరం పనిచేస్తున్నానని పేర్కొన్నారు.

## బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్-2026


**హైదరాబాద్,సెప్టెంబర్ 8(జర్నలిస్ట్ వార్త):**తెలంగాణ విశిష్ట సంస్కృతి, సంప్రదాయాలకు సజీవ ప్రతీక అయిన బతుకమ్మ పండుగ ప్రాశస్త్యాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయడంతో పాటు యువతలోని సృజనాత్మక ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న 'బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్ 2026'ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర సినిమాటోగ్రఫీ, రోడ్లు-భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎఫ్‌డీసీ ఎండీ జి. ముకుంద రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా, సెట్విన్ మాజీ ఛైర్మన్ గిరిధర్ రెడ్డిలతో కలిసి సచివాలయంలో ఈ ఛాలెంజ్ అధికారిక పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ... షార్ట్ ఫిలింలు, బతుకమ్మ పాటలు, సృజనాత్మక వీడియోల ద్వారా తమ ప్రతిభను చాటుకోవాలనుకునే యువ ఫిలిం మేకర్లకు ఈ ఛాలెంజ్ ఒక అద్భుత వేదికగా ఉపయోగపడుతుందన్నారు. బతుకమ్మ విశిష్టత, తెలంగాణ సంస్కృతి, జానపద కళలు, సంప్రదాయాలతో పాటు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కూడా ప్రతిబింబించేలా షార్ట్ ఫిలింలను రూపొందించవచ్చని తెలిపారు. ఈ పోటీల్లో యువ దర్శకులు, విద్యార్థులు, ఔత్సాహిక కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటాలని ఆకాంక్షించారు.

## గణేశ్ మండపాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి: సజ్జనార్



**హైదరాబాద్‌సెప్టెంబర్ 8(జర్నలిస్ట్ వార్త):** గణేష్ మండపాలు ఏర్పాటు చేసే వారు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్ స్పష్టం చేశారు. గణేశ్ మండపాల వివరాలను ఉత్సవ నిర్వాహకులు ముందస్తుగానే ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. నిర్వాహకులు పోలీస్‌పోర్టల్. టిఎస్‌పోలీస్.జిఓవి.ఇన్/ ఇన్‌డెక్స్. హెచ్‌టిఎం పోర్టల్‌ను సందర్శించి తమ వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు. చివరి నిమిషం వరకు వేచి చూడకుండా అధికారిక పోర్టల్ ద్వారా సమాచారం అందించి హైదరాబాద్ సిటీ పోలీస్ కు సహకరించాలని కోరారు. మండపాల ఏర్పాటు, నిమజ్జన వివరాలు ముందుగానే తెలిస్తే ఆయా ప్రాంతాల్లో పటిష్టమైన బందోబస్తు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, తగిన భద్రతాను పోలీసులు ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు.

## తెలంగాణలో 17 మంది డిఎస్‌పిల బదిలీ



**హైదరాబాద్‌సెప్టెంబర్ 8(జర్నలిస్ట్ వార్త):** రాష్ట్ర పోలీసు శాఖలో 17 మంది డిప్యూటీ సూపరింటెండెంట్స్ ఆఫ్ పోలీస్ (డిఎస్‌పి)లకు బదిలీలు, పోస్టింగులు కల్పిస్తూ డిజిపి సి.వి ఆనంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ బోర్డు సిఫారసుల మేరకు ఈ బదిలీలు తక్షణమే అమల్లోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బదిలీ అయిన అధికారులను సంబంధిత యూనిట్ అధికారులు వెంటనే రిలీవ్ చేసి, కొత్త పోస్టింగ్ ప్రదేశాల్లో విధుల్లో చేరేలా ఆదేశాలు జారీ చేశారు. వెయిటింగ్‌లో ఉన్న డిఎస్‌పి కె. బాలకృష్ణారెడ్డిని మల్కాజిగిరి సైబర్ క్రైమ్స్ ఏసిపిగా నియమించారు. అక్కడ పనిచేస్తున్న ఎస్.జీ. శివశంకర్‌ను డిజిపి కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.ఎస్‌కె. అబ్దుల్ రహ్మాన్‌ను జయశంకర్ భూపాలపల్లి డిసిఆర్‌బి ఫంక్షనల్ వర్టికల్స్ డిఎస్‌పిగా నియమించారు. ఏ. రవి కుమార్‌ను జగిత్యాల డిసిఆర్‌బి ఫంక్షనల్ వర్టికల్స్ డిఎస్‌పిగా పోస్టింగ్ ఇచ్చారు. బి. నందిరామ్ నాయక్‌ను డిజిపి కార్యాలయంలోని డిజి కంట్రోల్ రూమ్ డిఎస్‌పిగా, బి. సోమ్నారాయణ్ సింగ్‌కు టిజిపిఏ డిఎస్‌పిగా పోస్టింగ్ ఇచ్చారు. జె. వెంకటేశ్వర్‌రావును మెదక్ డిసిఆర్‌బి ఫంక్షనల్ వర్టికల్స్ డిఎస్‌పిగా, బి. కిషన్ కుమార్‌కు హైదరాబాద్ సిటీ సెక్రటేరియట్ సెక్యూరిటీ ఏసిపిగా పోస్టింగ్ ఇచ్చారు. ఎల్. రమేశ్ కుమార్‌ను హైదరాబాద్ సిటీ సిటిసి ఏసిపిగా నియమించారు. ఎన్. శ్రీనివాస్‌రెడ్డికిసంగారెడ్డి డిసిఆర్‌బి ఫంక్షనల్ వర్టికల్స్ డిఎస్‌పిగా పోస్టింగ్ ఇచ్చారు.కదరు వెంకట్‌రెడ్డిని టిజిపిఏ డిఎస్‌పిగా నియమించారు. కొమట్ల సుబ్బరామిరెడ్డికి హైదరాబాద్ సిటీ సిసిఎస్ అండ్ డిడి ఏసిపిగా పోస్టింగ్ ఇచ్చారు. ఎస్. సుదర్శన్‌ని హైదరాబాద్ సిటీ సిసిఎస్ అండ్ డిడి ఏసిపిగా నియమించారు. ఎన్. శంకర్‌కుహైదరాబాద్ సిటీ సెక్రటేరియట్ సెక్యూరిటీ ఏసిపిగా పోస్టింగ్ ఇచ్చారు. పీ. విజయ్ కుమార్‌ను వెస్ట్ జోన్ రోడ్ సేఫ్టీ డిఎస్‌పిగా నియమించారు. కె. భాస్కర్‌కు టిజిపిఏ డిఎస్‌పిగా పోస్టింగ్ ఇచ్చారు. ఎం. వెంకట నర్సయ్యను సిఐడి డిఎస్‌పిగా నియమించారు. కొత్తగా పోస్టింగ్ పొందిన అధికారులు తమ రిలీవ్ అనంతరం వెంటనే విధుల్లో చేరి, సంబంధిత ఉన్నతాధికారులకు ఛార్జ్ రిపోర్టులు సమర్పించాలని డిజిపి ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

# నేడు నవీన్ ప్రథమ వర్ధంతి




**వీణవంక/సెప్టెంబరు 8 (జర్నలిస్ట్ వార్త):** వీణవంక మండలం కొండపాక గ్రామానికి చెందిన కొలుగూరి నవీన్ ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు స్వగృహంలో సంవత్సరీక కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మంచితనానికి మారుపేరుగా నిలిచి పలువురి హృదయాల్లో చెరగని ముద్ర వేసిన నవీన్ ఇక లేరన్న లోటు తీరనిదని బంధుమిత్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి బంధుమిత్రులు, గ్రామస్థులు హాజరై నివాళు లర్పించాలని కుటుంబ సభ్యులు కోరారు.

## ఓటర్ల అభ్యంతరాలను నిష్పక్షపాతంగా పరిష్కరించాలి



**కేసముద్రం/ సెప్టెంబరు 8 (జర్నలిస్ట్ వార్త):** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా కేసముద్రం మండలం పెనుగొండ గ్రామంలో జరుగుతున్న పరిశీలన ప్రక్రియను జిల్లా కలెక్టర్ స్నేహా శబరీష్ మంగళవారం తనిఖీ చేశారు. ఓటర్ల నుంచి వచ్చిన అభ్యంతరాల ఫారాలను బీఎల్ఓ లాగిన్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసే విధానాన్ని పరిశీలించారు.ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరమే వివరాలను నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఓటర్ల పేర్ల నమోదు, తొలగింపు, సవరణలకు సంబంధించిన దరఖాస్తులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా, ఎలాంటి తప్పులకు తావులేకుండా నిర్వహించాలని సూచించారు. అందిన ప్రతి అభ్యంతరాన్ని నిష్పక్షపాతంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. అర్హుల పేర్లు తొలగిపోకుండా, కొత్తగా అర్హత పొందిన వారి పేర్లు జాబితాలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వివేక్, ఎంపీడీవో అఫ్సర్ పాషా, బీఎల్ఓలు, జీపీవోలు తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీలపై సస్పెన్షన్ వేటు వేయాలి



**హసన్‌పర్తి/సెప్టెంబర్ 8 (జర్నలిస్ట్ వార్త):** అసెంబ్లీ సమావేశాల సందర్భంగా గేటు బయట రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవిలో ఉన్న శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసి అమర్యాదగా ప్రవర్తించిన ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌రెడ్డిలపై వెంటనే సస్పెన్షన్ వేటు వేయాలని దళిత బహుజన ఫ్రంట్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పెద్దల సభలో సభ్యులుగా ఉన్న వారు రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న స్పీకర్‌పై ఈ విధంగా మాట్లాడటం సభ్యత, సంస్కారం కాదని రమేష్‌కుమార్ అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు వారి రాజకీయ పరిజ్ఞాన లోపాన్ని, పార్లమెంటరీ ప్రజాస్వామ్య విలువలపై అవగాహన లేమిని స్పష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు.భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా శాసనమండలి చైర్మన్ తగిన చర్యలు తీసుకోవాలని, సంబంధిత ఎమ్మెల్సీల సభ్యత్వాన్ని రద్దు చేసే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. స్పీకర్ దళితుడు కావడమే ఆయన చేసిన పాపమా? అని ప్రశ్నించారు.శాసనసభ, శాసనమండలి సంప్రదాయాలు, సభా మర్యాదలు తెలియని నాయకులపై రాజకీయ పార్టీలు కూడా కఠిన చర్యలు తీసుకోవాలని రమేష్‌కుమార్ డిమాండ్ చేశారు. ఎంతటి వారైనా పార్లమెంటరీ ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ వ్యవస్థల గౌరవాన్ని కాపాడే విధంగా వ్యవహరించాలని ఆయన సూచించారు.

## వినాయక మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి



**జమ్మికుంట/సెప్టెంబర్ 8 (జర్నలిస్ట్ వార్త):** రానున్న వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో జమ్మికుంట పోలీస్‌స్టేషన్‌లో వినాయక మండపాల నిర్వాహకులతో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్‌కుమార్ దిలీప్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో ఏర్పాటు చేసే ప్రతి వినాయక మండపాన్ని పోలీస్‌స్టేషన్‌తో పాటు విద్యుత్ శాఖ కార్యాలయంలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు.మండపాల వద్ద నిర్వాహకులు తగిన భద్రతా చర్యలు చేపట్టాలని, ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. నవరాత్రుల అనంతరం గణనాథుడి నిమజ్జన ఊరేగింపును త్వరగా ప్రారంభించి, భక్తుల దర్శనానికి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ప్రతి ఒక్కరూ సహకరించి ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, కౌన్సిలర్లు, ఏసీపీ మాధవి, సీఐ రామకృష్ణ, ఎస్ఐ, మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, ఎమ్మార్వో గడ్డం సుధాకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇల్లందుల రమేష్, విద్యుత్ శాఖ ఏఈతో పాటు పలువురు అధికారులు, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## ఎల్కతుర్తి సీఐ కొండ్రు శ్రీను ఆదర్శవంతుడు



**ఎల్కతుర్తి/సెప్టెంబర్ 8 (జర్నలిస్ట్ వార్త):** ఎల్కతుర్తి నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన కొండ్రు శ్రీనును హ్యూమన్ రైట్స్ మండల అధ్యక్షురాలు మేరీ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా మేరీ మాట్లాడుతూ.. కొండ్రు శ్రీను ఎల్కతుర్తి సీఐగా బాధ్యతలు చేపట్టడం పట్ల మండల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణతోపాటు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తూ ఆదర్శవంతమైన అధికారిగా పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత బాధ్యతలు చేపట్టి, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆమె కోరుకున్నారు.

# అంబేద్కర్‌ను అవమానిస్తే సహించేది లేదు!

**హమారా ప్రసాద్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి -కల్పిత నాయకుడు పుస్తకాన్ని నిషేధించాలి: మైస ఉపేందర్ మాదిగ**



**హనుమకొండ బ్యూరో ధర్మసాగర్/ సెప్టెంబర్ 8 (జర్నలిస్ట్ వార్త):** రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేద్కర్‌ను కించపరిచేలా వ్యాఖ్యలు చేస్తూ, ఆయనను 'కల్పిత నాయకుడు'గా చిత్రీకరిస్తూ పుస్తకం రాసిన హమారా ప్రసాద్‌పై ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్ మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం హన్మకొండలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

అంబేద్కర్‌ను కించపరచడం అంటే దేశ రాజ్యాంగాన్ని, దళితబహుజనుల ఆత్మగౌరవాన్ని అవమానించడమేనని ఉపేందర్ మాదిగ మండిపడ్డారు. అంబేద్కర్‌ను 'దేశ వ్యతిరేకి, హిందూ వ్యతిరేకి, వేర్పాటువాది'గా చిత్రీకరిస్తూ సామాజిక వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఇలాంటి రచనలను భావ ప్రకటనా స్వేచ్ఛ పేరుతో సమర్థించలేమని స్పష్టం చేశారు.అంబేద్కర్ లేకపోతే అణగారిన వర్గాలకు హక్కులే ఉండేవి కావని అన్నారు. రాజ్యాంగంలోని సమానత్వం, అంటరానితనం నిర్మూలన వంటి హక్కులతో కోట్లాది మంది గౌరవంగా జీవిస్తున్నారని తెలిపారు. అలాంటి మహనీయుడిని అవమానిస్తే మాదిగ హక్కుల పరిరక్షణ సమితి చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.హమారా ప్రసాద్‌పై చట్టపరంగా కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, పుస్తకంలోని అభ్యంతరకర అంశాలపై సమగ్ర విచారణ జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 'కల్పిత నాయకుడు పుస్తకంపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. అంబేద్కర్‌ను అవమానించే ప్రయత్నాలను అడ్డుకునేందుకు అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని మైస ఉపేందర్ మాదిగ హెచ్చరించారు.

# వాతావరణ మార్పులకు మల్బరీ సాగు ప్రత్యామ్నాయం

**కొత్తపల్లిలో రైతులకు పట్టు సాగుపై శిక్షణ**







**హనుమకొండ బ్యూరో/కొత్తపల్లి, సెప్టెంబర్ 8 (జర్నలిస్ట్ వార్త):** వాతావరణ మార్పులు, నీటి కొరతను దృష్టిలో పెట్టుకుని రైతులు తక్కువ నీటితో సాగు చేసే మల్బరీ పంట వైపు దృష్టి సారించాలని పట్టు పరిశ్రమ నిపుణులు సూచించారు. మల్బరీ సాగుతో పాటు పట్టు పురుగుల పెంపకం చేపడితే వ్యవసాయానికి అదనంగా స్థిరమైన ఆదాయం పొందే అవకాశం ఉంటుందని వివరించారు.

భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి రైతు వేదికలో మంగళవారం 'మేరా రేశంమేరా అభిమాన్ 2.0' కార్యక్రమంలో భాగంగా రైతులకు శిక్షణ నిర్వహించారు. కేంద్ర పట్టు మండలి, తెలంగాణ రాష్ట్ర పట్టు పరిశ్రమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఎల్‌నినో వంటి వాతావరణ పరిస్థితుల్లో నీటి వినియోగం ఎక్కువగా ఉండే పంటలకు మల్బరీ సాగు ప్రత్యామ్నాయంగా ఉంటుందని నిపుణులు వివరించారు.

**నీటి పొదుపుపై అవగాహన**

మల్బరీ తోటల పెంపకంలో నీటిని పొదుపుగా వినియోగించే పద్ధతులు, పట్టు పురుగుల పెంపకంలో పాటించాల్సిన జాగ్రత్తలు, చీడపీడలువ్యాధుల నివారణ, ఆధునిక సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. శాస్త్రీయ పద్ధతులను పాటిస్తే దిగుబడి పెంచుకోవడంతో పాటు పట్టు నాణ్యతను మెరుగుపరచుకోవచ్చని తెలిపారు.

**కొమురయ్యకు సన్మానం**

ఎలుకతుర్తి గ్రామానికి చెందిన పట్టు రైతు కొమురయ్యను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. ఆయన 1992 నుంచి 34 ఏళ్లుగా పట్టు సాగు చేస్తున్నారు. పట్టు పరిశ్రమలో సుదీర్ఘ అనుభవం, అంకితభావంతో సాగు చేస్తున్న ఆయనను నూతన రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు.



**70 మంది రైతుల హాజరు**

శిక్షణ కార్యక్రమంలో సుమారు 70 మంది రైతులు, మహిళలు, యువత, పట్టు సాగుపై ఆసక్తి ఉన్న నూతన రైతులు పాల్గొన్నారు. రైతుల్లో పట్టు పరిశ్రమపై ఆసక్తి పెరుగుతోందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త డా. వజ్రమ్మ, జిల్లా నోడల్ అధికారులు సంజీవ్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, పట్టు పరిశ్రమ అధికారి మల్లయ్య, వ్యవసాయ అధికారి పద్మ, ఏఈఓ క్రిసోలైట్, గ్రామ సర్పంచ్ మేకల వెంకన్న, ఉపసర్పంచ్ ఎన్.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వసతి గృహాల్లో మెరుగైన వసతులు





**మహబూబాబాద్/ సెప్టెంబరు 8 (జర్నలిస్ట్ వార్త):** ప్రభుత్వ వసతి గృహాల్లో ఆశ్రయం పొందుతున్న చిన్నారులకు నాణ్యమైన వసతులు, పౌష్టికాహారం అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి స్వాతి మురారి సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర, బాలికల సదనాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు.విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు, అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. నివాస గదులు, పారిశుద్ధ్యం, విద్యా సౌకర్యాలు, కౌన్సెలింగ్ గదులు, గ్రంథాలయం, వంటశాలను పరిశీలించారు. మెనూ ప్రకారం పరిశుభ్రమైన, సమతుల్య పౌష్టికాహారం అందించాలని, ఆహార నాణ్యతలో నిర్లక్ష్యం చేయరాదని నిర్వాహకులను ఆదేశించారు. చదువుతో పాటు పిల్లల మానసిక, శారీరక ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని, క్రమం తప్పకుండా యోగా, ధ్యానం, క్రీడలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సదనాల సూపరింటెండెంట్లు ధనలక్ష్మి, సునీల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రశాంతంగా వినాయక నిమజ్జనాలు

**అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి**
**కలెక్టర్ స్నేహ శబరిష్**

**మండపాలకు పోలీసుల అనుమతి**
**తప్పనిసరి: ఎస్పీ డాక్టర్ శబరిష్**



**మహబూబాబాద్/ సెప్టెంబరు 8 (జర్నలిస్ట్ వార్త):** వినాయక నిమజ్జనోత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎస్పీ డాక్టర్ శబరిష్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.

శోభాయాత్ర మార్గాలు, నిమజ్జన ఘాట్ల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించి సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిఘా పెట్టాలన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే మార్గమళ్లింపు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**విద్యుత్ ఏర్పాట్లు పటిష్ఠం**

ఊరేగింపు మార్గాల్లో రహదారి మరమ్మతులు పూర్తి చేయాలని, వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయాలని కలెక్టర్ సూచించారు. ఘాట్ల వద్ద నిరంతర విద్యుత్ సరఫరాతో పాటు జనరేటర్లు, హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు.

**రెస్క్యూ బృందాలు సిద్ధం**

నిమజ్జన ఘాట్ల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి గజ ఈతగాళ్లు, పడవలు, లైఫ్ జాకెట్లు, అగ్నిమాపక వాహనాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. జలాశయాల్లో నీటిమట్టాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. నిమజ్జనం అనంతరం పూజా సామగ్రి, చెత్తను వెంటనే తొలగించి పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు.

**అనుమతి తప్పనిసరి**

గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని ఎస్పీ డాక్టర్ శబరిష్ తెలిపారు. పోలీస్ వెబ్‌సైట్ లేదా సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు చేసుకుని అనుమతి పొందాలని సూచించారు.సమావేశంలో అదనపు కలెక్టర్లు కె.అనిల్‌కుమార్, పురుషోత్తం, డీఆర్వో నాగవాణి, డీఆర్డీవో మధుసూదనరాజు, ఆర్డీవోలు రాజేశ్వరి, గణేష్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి నృత్య పోటీల్లో ప్రసంగి డాన్స్ స్టూడియో విద్యార్థుల సత్తా

## ఐదు బహుమతులు కైవసం




**జమ్మికుంట/ సెప్టెంబరు 8 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్ర స్థాయి నృత్య పోటీల్లో జమ్మికుంటకు చెందిన ప్రసంగి డాన్స్ స్టూడియో ఫిట్‌నెస్ సెంటర్ విద్యార్థులు సత్తా చాటారు. మంచిర్యాల వైశ్య భవన్‌లో నిర్వహించిన గురుపూజోత్సవం2026 రాష్ట్ర స్థాయి సాంస్కృతిక నృత్య పోటీల్లో ఐదు బహుమతులు సాధించారు.

జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో లక్కీ ఈవెంట్స్ నిర్వహించిన ఈ పోటీల్లో తెలంగాణలోని వివిధ ప్రాంతాలకు చెందిన నృత్య కళాకారులు పాల్గొన్నారు. జూనియర్ సోలో ఫోక్ డాన్స్ విభాగంలో పి. ప్రకృతి ప్రథమ బహుమతి, జూనియర్ సోలో వెస్ట్రన్ డాన్స్‌లో కె. రసజ్ఞ తృతీయ బహుమతి సాధించారు. జూనియర్ డ్యూయెట్ విభాగంలో పి. ప్రకృతి, కె. రసజ్ఞ జోడీ ప్రథమ బహుమతి కైవసం చేసుకుంది. సీనియర్ సోలో ఫోక్ డాన్స్‌లో వి. భావన ప్రథమ బహుమతి, సీనియర్ సోలో వెస్ట్రన్ డాన్స్‌లో అశ్విత ద్వితీయ బహుమతి సాధించారు.విద్యార్థుల ప్రదర్శనలను న్యాయనిర్ణేత ఆర్. సర్వేష్ అభినందించారు. హావభావాలు, లయ, తాళం, శరీర కదలికలు, వ్యక్తీకరణ, వేదికపై ప్రదర్శన ఆకట్టుకున్నాయని ప్రశంసించారు. చిన్న వయసులోనే ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణతో ప్రదర్శనలు ఇవ్వడం అభినందనీయమన్నారు.కార్యక్రమంలో డీపీఆర్‌ఓ ఎం. కృష్ణమూర్తి, తెలంగాణ రాష్ట్ర జనపద కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి హనుమాండ్ల మధుకర్, మంచిర్యాల జిల్లా నృత్య కళాకారుల సంఘం అధ్యక్షుడు రాఖం సంతోష్, ఫోక్ డ్యాన్సర్లు వర్షిణి, నీతూ క్వీన్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి స్టూడియోకు మంచి పేరు తీసుకురావడం గర్వకారణమని డైరెక్టర్ శ్రీలత తెలిపారు. డాన్స్ మాస్టర్లు ప్రసంగి, రాజేష్ అందిస్తున్న నిరంతర శిక్షణ, క్రమశిక్షణ, వినూత్న కొరియోగ్రఫీ విద్యార్థుల విజయానికి దోహదపడుతున్నాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

# ఇల్లందకుంట పాఠశాలలో ఘనంగా అక్షరాస్యత దినోత్సవం

**ఇల్లందకుంట/సెప్టెంబర్ 8 (జర్నలిస్ట్ వార్త):** అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇల్లందకుంట మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం అక్షరాస్యతసామాజిక అభివృద్ధి అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, సామాజికవేత్త, రిటైర్డ్ ఉపాధ్యాయులు డాక్టర్ గంగిశెట్టి జగదీశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో 8, 9, 10వ తరగతులకు చెందిన 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు.పోటీల్లో పదో తరగతికి చెందిన మంకు రచన, బి. రాజేష్, వీ. శరణ్య వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. ఎనిమిదో తరగతికి చెందిన పి. అక్షయ నాలుగో స్థానం, ఎన్. శృతి ఐదో స్థానం, తొమ్మిదో తరగతికి చెందిన టి. సూర్యతేజ ఆరో స్థానం సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల



ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు కే. జయప్రకాష్, డాక్టర్ జగదీశ్వర్, ఉపాధ్యాయుల చేతుల మీదుగా శంకర్ నారాయణ డిక్షనరీలను బహుమతులుగా అందజేశారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కే. జయప్రకాష్ మాట్లాడుతూ గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం పాఠశాల విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు, పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందించడంతోపాటు గణితం, సైన్స్ ప్రతిభా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నారని తెలిపారు. విద్యార్థులను ఉన్నత చదువుల వైపు ప్రోత్సహిస్తున్న డాక్టర్ జగదీశ్వర్‌ను అభినందించారు.

ఉపాధ్యాయులు సీహెచ్. వేణు మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో గణితం, సైన్స్, ఇంగ్లిష్ టాలెంట్ టెస్టులు, హ్యాండ్‌రైటింగ్ పోటీలు నిర్వహించడంతోపాటు పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, డిక్షనరీలు అందిస్తున్నారని తెలిపారు. ఎస్‌ఎస్‌సీ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు, నగదు పురస్కారాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కొండ సత్యం, జి. అన్నపూర్ణ, కే. శంకర్, జె. రాధికారాణి, ఏ. సురేష్, డి. ఉమాదేవి, ఎం. ఐలయ్య, సీహెచ్. రామకృష్ణ, జి. శైలజ, ఆర్. దేవేందర్, ఎం. ప్రవంతి, వనిత, డి. పరమేష్, విశ్వతేజ తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నేరాలపై అప్రమత్తంగా ఉండాలి





**నాగారం/ సెప్టెంబర్ 8 (జర్నలిస్ట్ వార్త):** ప్రజల్లో సామాజిక చైతన్యం పెంపొందించడంతో పాటు నేరాలపై అవగాహన కల్పించేందుకు నాగారం గ్రామంలో పోలీస్ జాగృతి కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమానికి హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఎ.మహేందర్, ఎస్సై రవి, గ్రామ పోలీసు అధికారి వై.ప్రకాశ్‌తో పాటు పోలీసు సిబ్బంది హాజరయ్యారు.కళాబృందం సభ్యులు ఆటపాటలు, సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండటం, మహిళల భద్రత, షీ టీమ్స్ సేవలు, అత్యవసర సమయంలో 100, 112కు సమాచారం అందించడం వంటి అంశాలను వివరించారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు, వేధింపులు, రోడ్డు భద్రతా నిబంధనలు, మూఢనమ్మకాల నిర్మూలనపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఎ.మహేందర్ మాట్లాడుతూ సాంకేతికత విస్తరిస్తున్న నేపథ్యంలో సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా యువత, మహిళలు ఆన్‌లైన్ మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు, అసాంఘిక కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు.కార్యక్రమానికి నాగారం గ్రామస్థుల నుంచి విశేష స్పందన లభించింది. స్థానిక పెద్దలు, యువకులు, మహిళలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ రాజకీయ ఉనికి కోసం ఆందోళనలు చేస్తోంది.



**వర్ధన్నపేట/సెప్టెంబరు 8 (జర్నలిస్ట్ వార్త):** కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి బీఆర్ఎస్ రాజకీయ ఉనికి కోసం ఆందోళనలు చేస్తోందని కాంగ్రెస్ వర్ధన్నపేట మండల నాయకులు విమర్శించారు. మంగళవారం వర్ధన్నపేటలో నిర్వహించిన సమావేశంలో మండల అధ్యక్షుడు పోశాల వెంకన్నగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, అయినవోలు ఆలయ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దు సత్యం మాట్లాడారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు రుణమాఫీ వంటి పలు హామీలను అమలు చేసిందన్నారు. ప్రభుత్వంపై బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలు, నిరసనలు రాజకీయ ఉనికి కోసమేనని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్‌పై చేసిన ఆరోపణలు రాజకీయ విమర్శలేనని, వాటిపై ఆధారాలు వెల్లడించాల్సి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్నా నరసింహారెడ్డి, మెరుగు రమేష్, మెరుగు రాజాలు తదితరులు పాల్గొన్నారు.

# భూ సర్వే పక్కాగా సాగాలి

## జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



**కేసముద్రం/ సెప్టెంబర్ 8 (జర్నలిస్ట్ వార్త):** సమగ్ర భూ సర్వేను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా, పక్కాగా నిర్వహించాలని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామ పరిధిలోని చెరువుముందు తండాలో కొనసాగుతున్న భూ సర్వే ప్రక్రియను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

సర్వే బృందాలు వినియోగిస్తున్న రోవర్ల పనితీరు, భూముల సరిహద్దుల గుర్తింపు, డిజిటల్ మ్యాపింగ్ ప్రక్రియను కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. భూ యజమానుల సమక్షంలోనే ఖచ్చితమైన కొలతలు చేపట్టి, భవిష్యత్‌లో ఎలాంటి సరిహద్దు వివాదాలకు అవకాశం లేకుండా చూడాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని భూ రికార్డులను పక్కాగా నమోదు చేయాలని సర్వేయర్లకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కేసముద్రం తహశీల్దార్ వివేక్, మండల సర్వేయర్లు, జీపీఓ నర్మద, గ్రామపంచాయతీ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ర్యాలీలో టీడీపీ జెండాలు

## తాతా మధును సస్పెండ్ చేయాలని భారీ ర్యాలీ



**తల్లాడ/ సెప్టెంబర్ 8 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆయనను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ తల్లాడ మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గొడుగునూరి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ నుంచి ప్రారంభమైన ర్యాలీలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన సుమారు 700 మంది నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.మేళతాళాలు, డప్పు వాయిద్యాల నడుమ కాంగ్రెస్ జిందాబాద్ తాతా మధును సస్పెండ్ చేయాలి రేవంత్‌రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ ఎదురుగా తాతా మధు దిష్టిబొమ్మను చెప్పులతో కొట్టి దహనం చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల ఇన్‌చార్జి మూడుముంతల గంగరాజు, మండల అధ్యక్షుడు గొడుగునూరి లక్ష్మారెడ్డి, ఎస్సీ సెల్ నాయకుడు తాళ్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేయడం దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. తక్షణమే ఆయనను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.ర్యాలీలో టీడీపీ జెండాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జెండాలు కనిపించడంతో పలువురి దృష్టిని ఆకర్షించాయి. దీంతో ర్యాలీ సందర్భంగా టీడీపీ జెండాలు సందడి చేశాయి.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా, మండల, గ్రామస్థాయి నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తల్లాడ లో ప్రపంచ అక్షరాస్యత దినోత్సవం




**తల్లాడ/ సెప్టెంబర్ 8 (జర్నలిస్ట్ వార్త):** ప్రపంచ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని తల్లాడ మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీధర్‌రాజు, ఐకేపీ ఏపీఎం రవికుమార్, ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉంగరాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ర్యాలీ కొనసాగింది.విద్యార్థులు చేతపట్టిన ప్లకార్డులతో ఇల్లాలు చదువుఇంటికి వెలుగుచదువుకుంటేనే బంగారు భవిష్యత్ అంటూ నినాదాలు చేస్తూ ప్రజలకు అక్షరాస్యత ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ చదువుకోవడంతో పాటు నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని నిర్వాహకులు సూచించారు.

ఈ సందర్భంగా విద్యతో వ్యక్తిగత అభివృద్ధితో పాటు కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



**మధిర/ సెప్టెంబర్ 8 (జర్నలిస్ట్ వార్త):** మదర్ థెరిస్సా సేవాసదనం, మధిర ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకున్న ఉపాధ్యాయులను ఘనంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతూ విద్యారంగానికి విశిష్ట సేవలు అందిస్తున్న ఉపాధ్యాయుల అంకితభావం, నిబద్ధతకు గుర్తింపుగా ఈ పురస్కారాలు లభించాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ గౌరవం ఉపాధ్యాయుల జీవితంలో మరిన్ని విజయాలకు నాంది కావాలని ఆకాంక్షించారు.పురస్కార గ్రహీతలు వారణాసి కళావతి, శ్రీమతి లీలా విజయ్, సాధినేని రాజేశ్వరి, జ్యోతి, ఊస రమాదేవి, భిక్షాలు తదితరులను ఈ సందర్భంగా అభినందించారు. గెజిటెడ్ హెచ్‌ఎంను కూడా సత్కరించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సామాజిక సేవకులు, రిటైర్డ్ ఎంపీడీవో మాధవరపు నాగేశ్వరరావు, సామాజిక సేవకులు పుల్లఖండం సత్యనారాయణమూర్తి, ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు శెట్టిపోగు రాము హాజరై పురస్కార గ్రహీతలను అభినందించారు.మదర్ థెరిస్సా సేవాసదనం నిర్వాహకురాలు శ్రీమతి స్వర్ణలత సుందరరావుతో పాటు మధిర పట్టణ ప్రజలు, తదితరులు కార్యక్రమంలో పాల్గొని ఉత్తమ ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు.

# నిరుపేద మహిళకు వీల్‌చైర్ అందజేత

**తల్లాడ/ సెప్టెంబర్ 8 (జర్నలిస్ట్ వార్త):** నిరుపేదలకు అండగా నిలవడమే లక్ష్యంగా ఇశ్రాయేలు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రదర్ ఖమ్మంపాటి ఇజ్రాయిల్ తెలిపారు. మంగళవారం తల్లాడకు చెందిన నిరుపేద వృద్ధురాలు కొంగల ముత్తమ్మకు ట్రస్ట్ ఆధ్వర్యంలో వీల్‌చైర్ అందజేశారు.ఈ సందర్భంగా ఇజ్రాయిల్ మాట్లాడుతూ సమాజంలోని



నిరుపేదలను గుర్తించి వారికి అవసరమైన సహాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. దాతల సహకారంతో అట్టడుగు వర్గాలకు చేయూతనందిస్తున్నామని పేర్కొన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా పేద కుటుంబాలకు భరోసా కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి నిరుపేదలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# దేవాదాయ శాఖ ఆధీనంలోకి ఆలయం




**తల్లాడ/సెప్టెంబర్ 8 (జర్నలిస్ట్ వార్త):**తల్లాడ మండలం అంజనాపురం (రేచర్ల) గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీ భక్తాంజనేయ స్వామి, అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానం ఇకపై ప్రభుత్వ దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధీనంలో కొనసాగనుంది. ఈ విషయాన్ని ఖమ్మం డివిజన్ దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిశీలకులు ఆర్. సమత బుధవారం గ్రామంలో ప్రకటించారు.గ్రామస్తులు దేవాలయాన్ని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని ప్రజావాణి ద్వారా వినతులు సమర్పించడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు దేవస్థానాన్ని దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకున్నట్లు ఆమె తెలిపారు. దేవాలయంతో పాటు దానికి సంబంధించిన పరిసర భూములు కూడా ప్రభుత్వ దేవాలయ పరిధిలోకి వస్తాయని స్పష్టం చేశారు.దేవస్థానం ప్రభుత్వ ఆధీనంలోకి రావడాన్ని గ్రామస్తులు స్వాగతించారు. ఆలయ అభివృద్ధి, నిర్వహణ మరింత మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కొమ్మినేని ప్రభాకర్, కేతినేని చలపతి, నల్లగొర్ల కృష్ణయ్య, గురజాల వెంకటయ్య, పాముల కృష్ణారావు, చందా వెంకటేశ్వర్లు, అనుమోలు కోటేశ్వరరావు, కిన్నెర వెంకటేశ్వర్లు, గురజాల సుబ్బారావు, కొండా లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

# స్పీకర్‌పై వ్యాఖ్యలు అహంకారానికి నిదర్శనం

## దళిత సమాజాన్ని కించపరచడమే బీఆర్ఎస్ సంస్కృతి -దళిత కాంగ్రెస్ నేత బాణాల శ్రీనివాస్

**నర్సంపేట/ సెప్టెంబర్ 8 (జర్నలిస్ట్ వార్త):** అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ చేసిన అనుచిత వ్యాఖ్యలు అహంకారానికి నిదర్శనమని దళిత కాంగ్రెస్ నేత బాణాల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం నర్సంపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు దళిత కాంగ్రెస్ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవిలో ఉన్న దళిత నేత, అసెంబ్లీ స్పీకర్‌పై కించపరిచే భాషలో మాట్లాడటం తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. తాతా మధుసూదన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, దళిత సమాజానికి బీఆర్ఎస్ నాయకత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



తెలంగాణ ఏర్పాటుకు ముందు దళితులకు ఇచ్చిన హామీలను బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతవరకు అమలు చేసిందో ప్రజలకు సమాధానం చెప్పాలని శ్రీనివాస్ ప్రశ్నించారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామన్న హామీ, మూడెకరాల భూమి, డబుల్ బెడ్‌రూం ఇళ్ల హామీల పరిస్థితి ఏమైందని నిలదీశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు సముచిత ప్రాధాన్యం ఇస్తోందని, ఉపముఖ్యమంత్రి, అసెంబ్లీ స్పీకర్, ప్రభుత్వ విప్ వంటి కీలక పదవుల్లో దళితులకు అవకాశం కల్పించడమే ఇందుకు నిదర్శనమన్నారు. స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలకు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు దళిత సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు మాదాసి రవి, బాణాల ప్రసన్న శ్రీనివాస్, పొన్నాల మనీషా ప్రకాష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపెల్లి సందీప్, రూపిక శ్రావణ్‌కుమార్, మాదారపు చరణ్, మైదం రాకేష్, నూనె పద్మ, గద్ద జ్యోతి, గద్ద వెంకటేశ్వర్లు, గొర్రె నవీన్, గద్ద సంజీవ, కొమ్ము వినయ్, మంద విజయ్, మంద రాజేష్, చేరుపెల్లి అభినవ్, తాళ్ల దయానంద్, శ్రీరామ్, అవినేష్, భాస్కర్, రాకేష్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు తగవు

### కుల్ల యాకాంతం



**వర్ధన్నపేట/సెప్టెంబర్ 8 (జర్నలిస్ట్ వార్త);**
దళిత స్పీకర్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధుసూదన్ అనుచిత, అసభ్య వ్యాఖ్యలు చేయడం తగదని యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ కుల్ల యాకాంతం అన్నారు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న స్పీకర్‌ను అవమానించడం దళిత సమాజాన్ని అవమానించడమేనని పేర్కొన్నారు. తాత మధుసూదన్ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని స్పీకర్‌కు, దళిత సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

# స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కొత్తపేటలో కాంగ్రెస్ శ్రేణుల రాస్తారోకో.



**బయ్యారం/,సెప్టెంబర్ 8.(జర్నలిస్ట్ వార్త)**
తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ తాత మధు సోమవారం స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా మంగళవారం కొత్తపేట బస్టాండ్ సెంటర్ సమీపంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,కొత్తపేట గ్రామపంచాయతీ సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్, పార్టీ మండల అధ్యక్షులు జులకంటి సీతారాం రెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మూల మధుకర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ దళితుడైన స్పీకర్ పై ఇష్టానురీతిలో బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ తాత మధు నోరు పారేసుకోవడం చాలా బాధాకరమని, వెంటనే స్పీకర్ కు క్షమాపణ చెప్పాలని లేనియెడల అతనిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బయ్యారం మండల కాంగ్రెస్ పార్టీ పంచాయతీ సర్పంచ్ లు లింగ నాయక్,ప్రేమలత సేవాలాల్,భూక్య రవి,గూగులోతు మంగీలాల్,ఉపసర్పంచులు,ఇతర ప్రజాప్రతినిధులు సురేష్,రాంబాబు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గంధంపల్లిలో ఘనంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య జన్మదిన వేడుకలు.



**బయ్యారం/,సెప్టెంబర్ 8.(జర్నలిస్ట్ వార్త)**ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య జన్మదిన వేడుకలను గంధంపల్లి కొత్తపేట పంచాయతీలో సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి,పార్టీ కార్యకర్తలు,గ్రామ ప్రజలు కేక్ తినిపించుకొని ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం గ్రామ ప్రజల కోసం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మూల మధుకర్ రెడ్డి,బయ్యారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జూలకంటి సీతారామరెడ్డి హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రజల సంక్షేమం,నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న ప్రజానాయకుడని కొనియాడారు.కనకన్నకు ఆయురారోగ్యాలు,దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,గ్రామ పెద్దలు, మహిళలు,యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యే కోరం కనకయ్యకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# సీఐ సంజీవరావును కలిసిన సీపీఐ నాయకులు




**వర్ధన్నపేట/సెప్టెంబర్ 8(జర్నలిస్ట్ వార్త);** నూతనంగా బాధ్యతలు చేపట్టిన వర్ధన్నపేట సీఐ సంజీవరావును సీపీఐ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐని కలిసి శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా సీపీఐ పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఆరెల్లి ప్రభాకర్, మండల కార్యదర్శి బొడ్డుపల్లి సాయిలు మాట్లాడుతూ సీఐ కి అభినందనలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సి పి ఐ నాయకులు ఐలయ్య, బీరు నాయక్ తదితరులు ఉన్నారు.

# విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన

### -సీఐ రవీందర్.




**బయ్యారం,సెప్టెంబర్ 8.(జర్నలిస్ట్ వార్త)**బయ్యారం పోస్టుమెట్రిక్ హాస్టల్‌ను గార్ల బయ్యారం సీఐ రవీందర్,ఎస్ఐ ప్రశాంత్ బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా హాస్టల్‌లోని పరిసరాలు,విద్యార్థుల వసతి సౌకర్యాలు,భోజన ఏర్పాట్లు,మెనూ తదితర అంశాలను పరిశీలించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు.గుర్తుతెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్,మెసేజ్‌లు,లింకులు, సోషల్ మీడియా ఖాతాలు,ఆన్‌లైన్ మోసాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సీఐ సూచించారు.వ్యక్తిగత వివరాలు,బ్యాంక్ ఖాతా సమాచారం,ఓటీపీలు,పాస్‌వర్డ్‌లు ఇతరులతో పంచుకోవద్దని తెలిపారు.అదేవిధంగా మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.మత్తు పదార్థాలకు అలవాటు పడటం వల్ల ఆరోగ్యం,చదువు,కుటుంబం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని వివరించారు.అనంతరం సీఐ రవీందర్,ఎస్ఐ ప్రశాంత్ బాబు విద్యార్థులతో కలిసి హాస్టల్‌లో భోజనం చేశారు.విద్యార్థులతో కలిసి వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు,వారికి పోలీసుల సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా కల్పించారు.

# ఊరిపాలు గుర్తింపుపై వివాదం..?

## వేలేరులో మాదిగ కుటుంబాల మధ్య విభేదాలు

**వేలేరు/సెప్టెంబర్ 8(జర్నలిస్ట్ వార్త):** గ్రామంలో సంప్రదాయంగా డప్పులు కొట్టే కొన్ని మాదిగ కుటుంబాలను ఊరిపాలు గా పిలుస్తూ వస్తున్న స్థానిక ఆచారం నేపథ్యంలో, ఇతర ఇంటిపేర్ల మాదిగ కుటుంబాలను చిన్నచూపు చూస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమకు కూడా గ్రామ సామాజిక కార్యక్రమాల్లో సమాన గౌరవం, భాగస్వామ్యం కల్పించాలని వారు కోరుతున్నారు. ఈ ఆరోపణలపై అధికారులు నిష్పాక్షికంగా విచారణ చేపట్టి వాస్తవాలను తేల్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.




# సింగారంలో ఘనంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య జన్మదిన వేడుకలు.



**బయ్యారం/,సెప్టెంబర్ 8.(జర్నలిస్ట్ వార్త)**
ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య జన్మదిన వేడుకలను సింగారం గ్రామపంచాయతీలో సర్పంచ్ సపవత్ సరస్వతి రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామస్తుల సమక్షంలో ఎమ్మెల్యే జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కనకన్న ప్రజాసేవలో మరెన్నో సంవత్సరాలు కొనసాగాలని, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో చుంచు మమత,గ్రామ అధ్యక్షులు గంగవత్ రాంకీ నాయక్,వార్డు సభ్యులు,గ్రామ నాయకులు,మహిళలు పిల్లలు పాల్గొన్నారు.

## పోలీసు విచారణకు హాజరైన యూట్యూబర్ నందన.. అద్దంకిలో కూడా మరో కేసు నమోదు

**సెప్టెంబర్ 8(జర్నలిస్ట్ వార్త):**



వీసాలు, విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు చేసి మోసం చేసిందన్న ఆరోపణల కేసులో ప్రముఖ యూట్యూబర్ రమానందన చిక్కుల్లో పడింది. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ లో నమోదైన వీసా చీటింగ్ కేసులో ఆమె తన న్యాయవాదులతో కలిసి పోలీసుల ఎదుట విచారణకు హాజరైంది. విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రమానందన దంపతులు తన వద్ద నుంచి రూ.13 లక్షలు వసూలు చేసి మోసం చేశారని బాధితుడు క్రాంతి కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. యూకే నుంచి హైదరాబాద్ చేరుకున్న వెంటనే విచారణకు హాజరుకావాలని పోలీసులు నోటీసులు జారీ చేయడంతో ఆమె పీఎస్‌కు వచ్చింది.మరోవైపు, రమానందనపై ప్రకాశం జిల్లా అద్దంకి పోలీస్ స్టేషన్ లో కూడా మరో వీసా స్కామ్ కేసు నమోదు కావడం సంచలనం సృష్టిస్తోంది. 'డెస్టినీ కన్సల్టెన్సీ' పేరిట వీసా రెన్యువల్, సర్టిఫికెట్ ఆఫ్ స్పాన్సర్‌షిప్ ఇప్పిస్తామని నమ్మించి 2023లో తమ వద్ద భారీగా డబ్బులు వసూలు చేసి మోసం చేశారని బాధితులు పోలీసులను ఆశ్రయించారు. వరుస కేసులు నమోదవ్వడంతో బాధితులను ఇబ్రహీంపట్నం పీఎస్‌కే రావాలని రమానందన కోరినట్లు సమాచారం. దీంతో హైదరాబాద్‌తో పాటు అద్దంకికి చెందిన బాధితులు కూడా భారీగా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌కు చేరుకుంటున్నారు.

## ఇండోనేషియాలో బద్దలైన అగ్నిపర్వతం.


**సెప్టెంబర్ 8(జర్నలిస్ట్ వార్త):**



ఇండోనేషియాలోని సుప్రసిద్ధ అనక్ క్రాకటోవా అగ్నిపర్వతం బద్దలవడం తెలిసిందే. సుమారు 25 గంటల పాటు నిరంతరాయంగా లావా, బూడిద వెదజల్లడంతో ఆ ప్రాంతంలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. ఈ విస్ఫోటనం కారణంగా ఆకాశమంతా దట్టమైన బూడిద మేఘాలు అలుముకోవడంతో రవాణా వ్యవస్థ, ముఖ్యంగా విమాన సర్వీసులు పూర్తిగా స్తంభించిపోయాయి. ఈ అగ్నిపర్వతం 24 గంటల పాటు ఏకధాటిగా లావాను వెలిగక్కింది.
ఈ విస్ఫోటానికి సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.
ఆకాశంలో దట్టమైన బూడిద వ్యాపించడంతో ముందుజాగ్రత్త చర్యగా జకార్తాలోని సోకర్నో-హట్టా, హలిమ్ పెర్దనకుసుమ అంతర్జాతీయ విమానాశ్రయాలతో సహా మొత్తం 8 ఎయిర్‌పోర్టులను తాత్కాలికంగా మూసివేశారు.ఈ నిర్ణయంతో సుమారు 2,300 విమాన సర్వీసులు రద్దు లేదా దారి మళ్లించారు. దీనివల్ల దాదాపు 2.70 లక్షల మంది ప్రయాణికులు విమానాశ్రయాల్లోనే చిక్కుకుపోయారు. ఇండోనేషియా జియోలాజికల్ ఏజెన్సీ లెవెల్-3 (హై అలర్ట్) హెచ్చరికను జారీ చేసింది. స్థానికంగా పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. రాబోయే రోజుల్లో మరిన్ని విస్ఫోటనాలు సంభవించే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు.అయితే, ఈ విస్ఫోటనం వల్ల సునామీ ప్రమాదం ఏమీ లేదని అధికారులు స్పష్టం చేయడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. 2018లో ఇదే అగ్నిపర్వతం బద్దలైనప్పుడు సంభవించిన సునామీ కారణంగా సుమారు 430 మంది మరణించిన విషయం తెలిసిందే. ప్రస్తుతానికి బూడిద, విష వాయువులు, వేడి రాళ్ల ముప్పు మాత్రమే ఉందని తెలిపారు. పరిస్థితి వేగంగా మారుతున్నందున విమానాశ్రయాల పునఃప్రారంభంపై ఇప్పుడే స్పష్టత ఇవ్వలేమని రవాణా శాఖ మంత్రి దుదీ పుర్వగంధీ పేర్కొన్నారు. ప్రయాణికులు ఎప్పటికప్పుడు తమ విమానయాన సంస్థలను సంప్రదించాలని సూచించారు. పసిఫిక్ 'రింగ్ ఆఫ్ ఫైర్' ప్రాంతంలో ఉండటంతో ఇండోనేషియాలో తరచూ ఇలాంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తుంటాయి.

## తెలంగాణ పోలీసు ఉద్యోగ అభ్యర్థులకు దరఖాస్తు గడువు పెంపు

**సెప్టెంబర్ 8(జర్నలిస్ట్ వార్త):**




తెలంగాణలో పోలీస్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు రాష్ట్ర పోలీస్ నియామక మండలి (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) కీలక ప్రకటన చేసింది. కానిస్టేబుల్ స్థాయి పోస్టుల దరఖాస్తు గడువును పొడిగిస్తున్నట్లు బోర్డు వెల్లడించింది. షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 9వ తేదీతో ఈ గడువు ముగియాల్సి ఉండగా, అభ్యర్థుల సౌకర్యార్థం సెప్టెంబర్ 16వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అవకాశం కల్పించింది.రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 7,437 పోస్టుల భర్తీ కోసం టీఎస్ఎల్‌పీఆర్‌బీ జూలై 29న నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇందులో సివిల్ కానిస్టేబుల్ (3,697), ఏఆర్ కానిస్టేబుల్ (1,052), స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ కానిస్టేబుల్ (1,380), ఫైర్ ఫైటర్ (751), జైల్ వార్డర్ (208), ఎస్ఏఆర్ సీపీఎల్ (24) పోస్టులు ఉన్నాయి.
ఈ ఉద్యోగల కోసం ఇప్పటివరకు 3,38,336 మంది అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా, వారిలో 2,88,530 మంది ఫీజు చెల్లించి దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేశారు. ఆధార్ వెరిఫికేషన్ సైతం 95 శాతానికి పైగా పూర్తయినట్లు బోర్డు తెలిపింది. గడువు ముగిసే ఆఖరి రోజుల్లో దరఖాస్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, దీనివల్ల సాంకేతిక సమస్యలు తలెత్తే అవకాశం ఉందని బోర్డు పేర్కొంది. కాబట్టి అభ్యర్థులు చివరి నిమిషం వరకు వేచి చూడకుండా వీలైనంత త్వరగా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు టీఎస్ఎల్‌పీఆర్‌బీ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు.

## నన్నేమైనా అంటే నిజాలు బయటకు వస్తాయి: విజయసాయిరెడ్డి

**సెప్టెంబర్ 8(జర్నలిస్ట్ వార్త):**

మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుపై కీలక ప్రకటన చేశారు. దసరా పండుగ ముగిసిన మరుసటి రోజే తన కొత్త పార్టీని ప్రకటిస్తానని వెల్లడించారు. సోమవారం విజయవాడలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో టీడీపీ, వైసీపీలకు ప్రత్యామ్నాయంగా తన పార్టీ నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.
తెలుగుదేశం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలు రెండూ కుటుంబ పార్టీలేనని విజయసాయిరెడ్డి విమర్శించారు. ఒకరు అధికారం కోల్పోతే మరొకరు అధికారంలో ఉండాలని చూస్తున్నారని, ఈ నేపథ్యంలోనే రాష్ట్రానికి మూడో ప్రత్యామ్నాయం అవసరమని తాను భావిస్తున్నానని అన్నారు. తన వెనుక ఎంతమంది ఉన్నారనేది రాబోయే ఆరు నెలల నుంచి ఏడాదిలోపు అందరికీ తెలుస్తుందని చెప్పారు. తాను అమరావతికి వ్యతిరేకం కాదని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.
ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై ఆయన పరోక్షంగా హెచ్చరికలు జారీ చేశారు. వైసీపీలోని కోటరీ మళ్లీ తనను నమ్మకద్రోహి అంటూ రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తే, తన దగ్గర ఉన్న అనేక నిజాలను బయటపెట్టాల్సి వస్తుందని అన్నారు.తన పార్టీ కేఏ పాల్ పార్టీలా ఉంటుందని మంత్రి బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలపై సాయిరెడ్డి ఘాటుగా స్పందించారు. అసలు బొత్స ఎన్ని పార్టీలు మారారో, వైఎస్ మరణం తర్వాత ఎలా మాట్లాడారో గుర్తుచేసుకోవాలని ఎద్దేవా చేశారు. ప్రజాధనాన్ని దోచుకుని పార్టీ పెడుతున్నారని మంత్రి సత్యకుమార్ చేసిన ఆరోపణలపై బదులిస్తూ.. "నేను ప్రజాధనం దోచుకుంటే నాపై కేసులు పెట్టి అరెస్టు చేయమనండి" అని సవాల్ విసిరారు. తనకు బీజేపీతో మంచి సంబంధాలు ఉన్నాయని, ఆ విషయం బహుశా మంత్రికి తెలియదేమోనని వ్యాఖ్యానించారు.

# పెరుగుతున్న సైబర్ మోసాలు

**సెప్టెంబర్ 8(జర్నలిస్ట్ వార్త):**

నేటి కాలంలో సైబర్ మోసాలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఎదో ఒకచోట ఎదో ఒక రకంగా వినియోగదారులు, ప్రజలు సైబర్ దాడులకు గురై మోసపోతూనే ఉన్నారు. తాజాగా.. మెటా సంస్థకు చెందిన ఇన్‌స్టాగ్రామ్‌లో కొందరు మోసగాళ్లు ఇతరుల పోస్టులపై కావాలనే తప్పుడు కాపీరైట్ ఫిర్యాదులు చేస్తున్నారు. ఆ తర్వాత వాటిని వెనక్కి తీసుకోవాలంటే డబ్బులు ఇవ్వాలంటూ బెదిరిస్తున్నారు. పదేపదే ఇలాంటి ఫిర్యాదులు వస్తే తమ ఖాతాలు శాశ్వతంగా బ్లాక్ అవుతాయనే భయంతో యూజర్లు వాళ్లు అడిగినంత ఇచ్చుకుంటున్నారు. 15 లక్షల మంది ఫాలోవర్లు ఉన్న ఒక ఇన్‌స్టాగ్రామ్ యూజర్, తన ఖాతాను కాపాడుకోవడానికి ఒక మోసగాడికి 50 డాలర్లు (రూ. 4700) చెల్లించినట్లు బీబీసీకి తెలిపారు. మెటా అప్పీల్ ప్రక్రియకు వారాల సమయం పడుతుందని, ఆ ప్రాసెస్‌లో వెళ్తే తనకు గతంలో వేల రూపాయల ఆదాయం పోయిందని ఆయన అన్నారు. "ఈ పరిస్థితి బాధితులకు ఎంత ఇబ్బందిగా ఉంటుందో మాకు అర్థమవుతోంది, ఇలాంటివి జరగకుండా నిరోధించేలానే మా వ్యవస్థలను తీర్చిదిద్దాం" అని మెటా ప్రతినిధి వివరించారు. "మా విచారణ తర్వాత, సదరు కంటెంట్‌ను మళ్లీ యథాస్థితికి తెచ్చాం. భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరగకుండా ఖాతాలకు అదనపు భద్రతను కూడా కల్పించాం" అని తెలిపారు. కానీ, ఏది నిజమైన ఫిర్యాదో, ఏది నకిలీదో గుర్తించడంలో మెటా పనితీరు పేలవంగా ఉందని క్రియేటర్లు అంటున్నారు. నెలవారీ ఫీజు చెల్లించే క్రియేటర్ల అప్పీళ్లకు తప్ప, సాధారణ యూజర్ల ఫిర్యాదులకు సంస్థ త్వరగా స్పందించడం లేదని వారు బీబీసీతో చెప్పారు. 'లాస్ట్ ఇన్ టైమ్ హిస్టరీ' అనే ఇన్‌స్టాగ్రామ్ పేజీ పాత చారిత్రక చిత్రాలను పోస్ట్ చేస్తూ ఉంటుంది. దీనికి 15 లక్షలకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. దీనిని నడిపే ఓలి ( పూర్తి పేరు చెప్పడానికి ఇష్టపడలేదు), తాను పబ్లిక్ డొమైన్‌లో అందుబాటులో ఉన్న చిత్రాలను లేదా హక్కుదారుల అనుమతి



ఉన్నవాటినే పోస్ట్ చేస్తున్నట్లు బీబీసీకి చెప్పారు. అయినా సరే, ఈ ఏడాదిలో అతనికి ఇప్పటివరకు డజన్ల కొద్దీ "స్పష్టంగా నకిలీ" కాపీరైట్ ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదులు వచ్చిన వెంటనే మెటా వాటి వాస్తవాన్ని చెక్ చేయదు. కాబట్టి ఎవరి ఖాతాపైనైనా ఇలా వరుసగా ఫిర్యాదులు వస్తే వాళ్ల అకౌంట్ తాత్కాలికంగా ఆగిపోతుంది. ఒకే ఈమెయిల్ ఐడీ నుంచి ఒకేసారి తన పలు పోస్టులపై కాపీరైట్ స్ట్రైక్స్ వస్తున్నాయని ఓలి చెప్పారు. ఆ తర్వాత ఆ ఫిర్యాదు చేసిన వ్యక్తి, టెలిగ్రామ్ లాంటి ప్రైవేట్ మెసేజింగ్ యాప్‌లోకి రమ్మని మెసేజ్ చేస్తాడు. "వాళ్లు కొంత డబ్బు డిమాండ్ చేస్తారు" అని ఓలి తెలిపారు. ఆ ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలంటే సాధారణంగా కొన్ని వందల డాలర్లు అడుగుతారని చెప్పారు. డబ్బు అడగడం లేదా భవిష్యత్తులో మరిన్ని కాపీరైట్ ఫిర్యాదులు చేస్తామని బెదిరించడం లాంటి మెసేజ్‌లను బీబీసీ కూడా పరిశీలించింది. ఇన్‌స్టాగ్రామ్ తాత్కాలికంగా ఆపేసిన తన అకౌంట్‌ను తిరిగి తెచ్చుకోవడానికి ఓలి చివరికి ఒక మోసగాడికి క్రిప్టోకరెన్సీ రూపంలో 50 డాలర్లు ఇవ్వడానికి ఒప్పుకున్నారు. ఇలా డబ్బులు ఇస్తే నేరగాళ్లను ప్రోత్సహించినట్లే అవుతుందని, కాబట్టి డబ్బులు ఇవ్వొద్దని పోలీసులు బాధితులకు సూచిస్తున్నారు. మెటాను సంప్రదించి ఖాతాను వెనక్కి తెచ్చుకోవాలంటే వారాల కొద్దీ సమయం పడుతుంది కాబట్టి, వేగంగా పనైపోతుందనే ఉద్దేశంతోనే తాను "చివరి ప్రయత్నంగా" డబ్బు కట్టానని ఓలి అన్నారు. కానీ డబ్బు ఇచ్చిన వెంటనే మళ్లీ అతనికి కాపీరైట్ స్ట్రైక్స్ పడ్డాయి. "అదే అత్యంత బాధాకరమైన విషయం" అన్నారు ఓలి. "మనల్ని అంతలా టార్చర్ చేసినవాళ్లకే డబ్బులు సమర్పించుకోవడం, ఆ వెంటనే మళ్లీ వాళ్లు అదే పని చేయడం మనకు ఎంతో నరకంగా అనిపిస్తుంది" అన్నారు. కాపీరైట్ దావాలు ఎక్కువగా రావడంతో ఓలి ఖాతాకు మానిటైజేషన్ ఆగిపోయింది. అంటే, అతని పోస్టులు ఎంత వైరల్ అయినా ఇన్‌స్టాగ్రామ్ నుంచి అతనికి నయాపైసా రాదు. "ఇది వేధింపులా కాదా అని తెలుసుకోవడానికి లేదా అసలు ఏం జరుగుతుందో కనిపెట్టడానికి (మెటా నుంచి) వ్యవస్థలో కనీస విచారణ కూడా జరగడం లేదు" అని ఓలి అన్నారు. చాలా మంది ఇన్‌స్టాగ్రామ్ యూజర్లు కూడా ఇలాంటి అనుభవాలనే పంచుకున్నారు. "క్రియేటర్ల కోసమే తాము ఉన్నామని మెటా పైకి చెబుతున్నప్పటికీ, ఈ ప్రాసెస్‌లో వాళ్లు కనీస సాయం కూడా చేయలేదు. పైగా కస్టమర్ సపోర్ట్ కోసం డబ్బులు కట్టమంటారు" అని 'మోర్బిడ్ క్యూరియాసిటీ' పేజీని రన్ చేస్తున్న అభిన్ టామ్ సెబాస్టియన్ అన్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో 'బ్లూ టిక్' (వెరిఫైడ్) కావడానికి మెటా నెలవారీ ఫీజు వసూలు చేస్తుంది, దీనివల్ల లైవ్ చాట్ ద్వారా 24 గంటలూ కస్టమర్ సపోర్ట్ దొరుకుతుంది. "నాకు రావాల్సిన అత్యంత కీలకమైన బ్రాండ్ కాంట్రాక్టులు వేరే క్రియేటర్ చేతికి వెళ్లిపోవడంతో నేను కోలుకోలేని దెబ్బ తిన్నాను. ఇలాంటివి మళ్లీ జరగవని చెప్పి మెటా నుంచి నాకు ఎలాంటి భరోసా గానీ సపోర్ట్ గానీ దొరకలేదు" అని సెబాస్టియన్ అన్నారు. కాగా, అసలైన కాపీరైట్ హక్కుదారులు లేదా వాళ్లు నియమించుకున్న ప్రతినిధులు మాత్రమే కాపీరైట్ ఉల్లంఘనపై ఫిర్యాదు చేయగలరని ఇన్‌స్టాగ్రామ్ చెబుతోంది. బాధితులు నేరుగా ఆ హక్కుదారులనే సంప్రదించాలని సూచిస్తోంది. ఎదైనమైనా ఇలాంటి మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే పోలీసుల సహాయం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# భారత్‌లో ఈవీల జోరు..

### ఆగస్టులో ఆల్ టైమ్ రికార్డు అమ్మకాలు




భారత్‌లో ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) విక్రయాలు సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నాయి. 2026 ఆగస్టు నెలలో ఈవీ అమ్మకాలు మునుపెన్నడూ లేని విధంగా ఆల్-టైమ్ గరిష్ఠ స్థాయికి చేరాయి. గత ఏడాదితో పోలిస్తే ఏకంగా 52.9 శాతం వృద్ధితో మొత్తం 2,98,448 యూనిట్ల ఈవీలు అమ్ముడయ్యాయి. దీంతో మొత్తం ఆటోమొబైల్ మార్కెట్‌లో ఈవీల వాటా 9.5 శాతం నుంచి 12.3 శాతానికి పెరిగింది. ఈ మేరకు ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్ (ఫాడా) మంగళవారం గణాంకాలను విడుదల చేసింది.ఫాడా నివేదిక ప్రకారం, ద్విచక్ర వాహనాలు, త్రిచక్ర వాహనాలు, ప్యాసింజర్ వాహనాలు, వాణిజ్య వాహనాలు.. ఇలా అన్ని విభాగాల్లోనూ ఆగస్టు నెలలో రికార్డు స్థాయి అమ్మకాలు నమోదవడం విశేషం.

**విభాగాల వారీగా అమ్మకాలు ఇలా..**

ఎప్పటిలాగే, ఈవీ ద్విచక్ర వాహనాల అమ్మకాలు 67.05 శాతం వృద్ధితో 1,83,204 యూనిట్లకు చేరాయి. ఈ విభాగంలో టీవీఎస్ మోటార్ 48,938 యూనిట్లతో అగ్రస్థానంలో నిలవగా, బజాజ్ ఆటో (41,114), ఏథర్ ఎనర్జీ (28,757) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. అయితే, ప్రముఖ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ అమ్మకాలు గతేడాదితో పోలిస్తే 29 శాతం తగ్గి 13,852 యూనిట్లకు పరిమితమయ్యాయి.
ఎలక్ట్రిక్ త్రిచక్ర వాహనాల విక్రయాలు 25.28 శాతం పెరిగి 79,846 యూనిట్లుగా నమోదయ్యాయి. ఈ విభాగంలో బజాజ్ ఆటో (13,833) మొదటి స్థానంలో, మహీంద్రా లాస్ట్ మైల్ మొబిలిటీ (12,806) రెండో స్థానంలో నిలిచాయి. ఇక ప్యాసింజర్ వాహనాల (కార్లు) అమ్మకాలు 51.89% వృద్ధితో 30,696 యూనిట్లకు పెరిగాయి. ఈ సెగ్మెంట్‌లో టాటా మోటార్స్ (13,158), మహీంద్రా అండ్ మహీంద్రా (6,464), జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా (4,622) టాప్-3లో ఉన్నాయి. కొత్తగా మార్కెట్లోకి వచ్చిన విన్‌ఫాస్ట్ 2,199, టెస్లా 116 కార్లను విక్రయించాయి.
అన్నింటికంటే వేగంగా వృద్ధి చెందిన విభాగం ఎలక్ట్రిక్ వాణిజ్య వాహనాలే. గతేడాది ఆగస్టులో కేవలం 1,631 యూనిట్లు అమ్ముడవగా, ఈసారి అమ్మకాలు దాదాపు మూడు రెట్లు పెరిగి 4,702 యూనిట్లకు చేరాయి.


**సబ్సిడీలపై ఆధారపడటం లేదు..**

ఈ గణాంకాలపై ఫాడా అధ్యక్షుడు సాయి గిరిధర్ మాట్లాడుతూ.. "భారత్‌లో ఎలక్ట్రిక్ మొబిలిటీకి ఆగస్టు నెల చరిత్రాత్మకం. ముఖ్యంగా వాణిజ్య వాహనాల విభాగం పనితీరు అద్భుతం. అవి పైలట్ ప్రాజెక్టుల దశ నుంచి నేరుగా కొనుగోలు ఆర్డర్ల స్థాయికి చేరాయి. ఇప్పుడు ఈవీల అమ్మకాలు కేవలం సబ్సిడీల మీద ఆధారపడి లేవు. నిర్వహణ వ్యయం తగ్గడం, ఛార్జింగ్ సౌకర్యాలు విస్తరించడం, వినియోగదారుల్లో నమ్మకం పెరగడం వంటి అంశాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. పీఎం ఈ-డ్రైవ్, రాష్ట్రాల విధానాలు కూడా ఇందుకు దోహదపడుతున్నాయి" అని వివరించారు.

# కొబ్బరి వ్యర్థాలతో వాటర్ ఫిల్టర్ తయారీ

### శాస్త్రవేత్తలకే సాధ్యం కాని సమస్యను ఛేదించిన టీనేజర్..





సముద్రాల్లో పేరుకుపోతున్న మైక్రోప్లాస్టిక్ వ్యర్థాలను ఎలా తగ్గించాలి? పర్యావరణ శాస్త్రవేత్తలు ఏళ్లుగా పరిష్కారాల కోసం ప్రయత్నిస్తున్నారు. కానీ ఓ హైస్కూల్ విద్యార్థిని మాత్రం సమస్యకు పరిష్కారాన్ని కొబ్బరి పీచులోనే వెతికింది. హవాయిలోని ఈస్ట్ హొనొలులుకు చెందిన వెరా వాంగ్ చేసిన పరిశోధన ఇప్పుడు అంతర్జాతీయంగా ఆసక్తిని రేపుతోంది. కొబ్బరి వ్యర్థాలతో తయారు చేసిన ఫిల్టర్‌తో మైక్రోప్లాస్టిక్స్‌ను పట్టుకోవడమే కాదు.. వాటిని కరిగించగల ఫంగస్‌ను కూడా ఆమె గుర్తించింది.

**కొబ్బరి వ్యర్థాలతో ప్రయోగం**

కైసర్ హైస్కూల్‌లో చదువుతున్న వెరా.. పదో తరగతిలోనే సముద్ర కాలుష్యంపై దృష్టి పెట్టింది. కొబ్బరి పీచు, ఇతర కొబ్బరి వ్యర్థాలతో ఓ వాటర్ ఫిల్టర్‌ను రూపొందించింది. సంప్రదాయ పాలినేషియన్ అల్లిక పద్ధతుల నుంచి స్ఫూర్తి పొందింది. ఈ ఫిల్టర్ నీటిలో తేలియాడే మైక్రోప్లాస్టిక్స్, సన్‌స్క్రీన్ రసాయనాలను సమర్థంగా పట్టుకున్నట్లు గుర్తించింది.

**అసలు సీక్రెట్ ఫంగస్‌లోనే!**

వ్యర్థాలను పట్టుకోవడం మాత్రమే సరిపోదని వెరా భావించింది. ఫిల్టర్‌లో చిక్కుకున్న వ్యర్థాలను పూర్తిగా తొలగించే మార్గంపై పరిశోధన మొదలుపెట్టింది. కొబ్బరి పీచు రంధ్రాల నిర్మాణం గాలి, నీటి ప్రసరణకు అనుకూలంగా ఉంటుందని గుర్తించింది. దీంతో అందులో ఉండే సూక్ష్మజీవులపై దృష్టి పెట్టింది.
హవాయి యూనివర్సిటీ పరిశోధకులతో కలిసి చేసిన ప్రయోగాల్లో కొబ్బరి తంతువులపై సహజంగా పెరిగే కొన్ని ఫంగస్ జాతులు బయటపడ్డాయి. ఇవి సన్‌స్క్రీన్‌లోని కొన్ని రసాయనాలతో పాటు ప్లాస్టిక్ పదార్థాలను కూడా జీవక్రియ ద్వారా విచ్ఛిన్నం చేయగల సామర్థ్యం కలిగి ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు.

**సైన్స్‌లో కొత్త జాతుల జాడ!**

కొబ్బరి పీచులోని సహజ టానిన్ పదార్థాలు ఈ ఫంగస్ పెరుగుదలకు తోడ్పడుతున్నట్లు ప్రయోగాల్లో తేలింది. అంతేకాదు.. వెరా గుర్తించిన కొన్ని ఫంగస్ జాతుల జన్యు నమూనాలు ప్రపంచంలోని అతిపెద్ద జన్యు డేటాబేస్‌లోని రికార్డులతో సరిపోలలేదు. దీంతో ఇప్పటివరకు శాస్త్రవేత్తలకు తెలియని ఫంగస్ జాతులు కావచ్చనే ఆసక్తికర అంశం వెలుగులోకి వచ్చింది.
ఈ పరిశోధనకు హవాయి స్టేట్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ఫెయిర్‌లో మైక్రోబయాలజీ విభాగంలో మొదటి బహుమతి దక్కింది. మెక్‌ఇనెర్నీ ఫౌండేషన్ స్కాలర్‌షిప్ కూడా లభించింది. ఈ విజయంతో అంతర్జాతీయ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ఫెయిర్‌కు వెరా ఎంపికైంది.